## శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు.ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్లు ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు.


# నవతరం

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2018/76747

HYDERABAD | DR. YELLAMPALLY

NAVATARAM TELUGU DAILY | PAGES: 04 13-09-2026


# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**హైదరాబాద్, నవతరం:** వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.



# ఏడాదిగా వేధింపులు..



అమెరికాలో భారత సంతతికి చెందిన మహిళ దారుణ హత్యకు గురయ్యారు. కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో నివాసముంటున్న 38 ఏళ్ల షాలిని ఠాకూర్‌ను, గత ఏడాది కాలంగా వేధిస్తున్న ఓ యువకుడు నడిరోడ్డుపై కాల్చి చంపాడు. అనంతరం నిందితుడు కూడా తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘోర ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఆర్డెన్-ఆర్కేడ్ ప్రాంతంలోని పనేరా బ్రెడ్ రెస్టారెంట్ వెలుపల మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. 22 ఏళ్ల రోహిత్ అనే నిందితుడు షాలినిని వెంబడించి, అందరూ చూస్తుండగానే ఆమెపై పలుమార్లు కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. హత్య అనంతరం నిందితుడు ఘటనా స్థలం నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు హైవే-50 వద్ద అతడిని గుర్తించి చుట్టుముట్టారు. ఆ సమయంలో రోహిత్ తన వద్దనున్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిందితుడిపై తాము ఎటువంటి కాల్పులు జరపలేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

# నిజమైన మహిళా సాధికారత అంటే అదే...




మహిళా క్రికెట్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్న తరుణంలో, వారికి కుటుంబం, సమాజం నుంచి మరింత ప్రోత్సాహం అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం జరిగిన ఆర్ఎక్స్ఎస్ (RXS) మహిళా క్రికెట్ జట్టు జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో జట్టు బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మాట్లాడుతూ, మహిళా క్రికెట్‌కు గుర్తింపు లభించడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారిణులను గుర్తించి, వారిని ఉన్నత స్థాయికి చేరేలా అండగా నిలవాలని సూచించారు. "ఒక అమ్మాయి తాను ఇష్టపడిన రంగంలో రాణించేలా ప్రోత్సహించి, చివరి వరకు తోడుగా నిలవడమే నిజమైన మహిళా సాధికారత" అని ఆమె వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరింత మంది క్రీడాకారిణులు భారత జాతీయ జట్టులో చోటు సంపాదించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఆర్ఎక్స్ఎస్ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జట్టు బ్రాండ్ అంబాసిడర్ నిధి అగర్వాల్ సందడి చేశారు. ఆమె జెర్సీని ఆవిష్కరించి, జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు. "రాయలసీమ స్ఫూర్తి"ని ప్రతిబింబించేలా ఈ జెర్సీని రూపొందించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై, క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు.

# తెలంగాణలో ఆగని వానలు

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

**ఆరోగ్య శాఖ హెచ్చరిక**

వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.



# క్రీడాకారుడిని అవమానించొద్దు

**అమరావతి, నవతరం:** డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా..

**హైదరాబాద్, నవతరం:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.



## కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ శాసనసభలో 'కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు' (CURE Bill) పై జరిగిన చర్చ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఆయన... శాసనసభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లేదా ప్రజా సమస్యలపై సూచనలు చేసినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది నిధులు మంజూరు చేయడం ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ... ఆ నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలకు తగిన భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ కూడా హైదరాబాద్‌ను గొప్పగా అభివృద్ధి చేయాలని భావించినప్పటికీ... హైదరాబాద్ ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశాలు పెట్టాలని తాను ఇచ్చిన సూచనలను ఆయన పట్టించుకోలేదని రాజాసింగ్ గుర్తుచేశారు. ఇప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకుండా, నగర పరిధిలోని ఎమ్మెల్యేలందరితో కలిసి ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని కోరారు.

హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయికి చేరాలంటే ముందుగా బస్తీలు, గల్లీలలో ఉన్న ప్రాథమిక సమస్యలు తీరాలని రాజాసింగ్ పేర్కొన్నారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల మధ్య తీవ్ర అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని... మంచినీటి సరఫరా ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు మురికి నీరే వస్తోందని సభ దృష్టికి తెచ్చారు. కొన్ని ప్రాంతాలలో అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున 3, 4 గంటలకు నీరు విడుదల చేస్తుండటంతో ప్రజలు నిద్రలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తగినంత రవాణా, డ్రైనేజీ సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించకుండానే బహుళ అంతస్తుల (హైరైజ్) భవనాలకు అనుమతులు ఇవ్వడం వల్ల సమస్య మరింత సంక్లిష్టంగా మారుతోందని విమర్శించారు.



## రెండు ఆహార ఉత్పత్తులపై FSSAI కొరడా

రెండు ప్రముఖ కంపెనీలకు చెందిన ఆహార ఉత్పత్తులు వినియోగదారుల ఆరోగ్యానికి సురక్షితం కావని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) శనివారం వెల్లడించింది. ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమవడంతో, వాటిని తక్షణమే మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని (రీకాల్) సదరు కంపెనీలను ఆదేశించింది. నీలగిరి ఆయిల్ అండ్ అల్లైడ్ ఇండస్ట్రీస్‌కు చెందిన 'షాలిమార్స్ చెఫ్ - కొరియాండర్ పౌడర్', ఆక్వాగ్రి ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 'క్యారెజీనన్' ఉత్పత్తులను నిలిపివేయాలని స్పష్టం చేసింది.  నీలగిరి ఆయిల్ కంపెనీ ప్రాంగణం నుంచి సేకరించిన 'షాలిమార్స్ చెఫ్' ధనియాల పొడి నమూనాలను పరీక్షించగా, అందులో అనుమతించిన పరిమితికి మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు తేలింది. దీంతో ఈ ఉత్పత్తి ఆరోగ్యానికి సురక్షితం కాదని అధికారులు వర్గీకరించారు. అయితే, అధికారుల నిర్ణయంపై సదరు కంపెనీ అప్పీల్ చేయడంతో మరోసారి పరీక్షలు నిర్వహించగా, అప్పుడు కూడా ఫలితాల్లో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో ఈ ఉత్పత్తి ప్రమాదకరమైనదేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ పునరుద్ఘాటించింది. మరో కేసులో, ఆక్వాగ్రి ప్రాసెసింగ్ సంస్థ నుంచి సేకరించిన 'క్యారెజీనన్ (ఎర్రసముద్రం నుంచి సేకరించిన సీవీడ్ ఉత్పత్తి)' నమూనాలో అనుమతించిన స్థాయి కంటే ఎక్కువగా కాడ్మియం ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ కంపెనీ కూడా అప్పీల్ చేయగా, రిఫరల్ ల్యాబొరేటరీలో జరిపిన రీ-టెస్టింగ్‌లోనూ సదరు ఉత్పత్తి సురక్షితం కాదని తేలింది. ఈ రెండు ఉత్పత్తులు ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ రీకాల్ ప్రొసీజర్) రెగ్యులేషన్స్, 2017 ప్రకారం, ఈ ఉత్పత్తులను మార్కెట్ నుంచి తక్షణమే ఉపసంహరించుకోవాలని సంబంధిత కంపెనీలను ఆదేశించింది.

एफएसएसएआई
fssai

# యూట్యూబర్ రమానందనపై మరో కేసు

**హైదరాబాద్, నవతరం:** లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందనకు ప్రకాశం జిల్లా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. తన యూట్యూబ్ ఛానల్ 'నందూస్ వరల్డ్' ద్వారా నందన తెలుగు ప్రజలకు సుపరిచితురాలు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం పేరాయపాలెంకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కోడలికి లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, నందన తమ నుంచి రూ.10.50 లక్షలు వసూలు చేశారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో చాలా మందికి ఉద్యోగాలు ఇప్పించానని చెప్పడంతో విడతల వారీగా ఈ మొత్తాన్ని ఆమెకు బదిలీ చేసినట్లు తెలిపారు. అయితే, ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో జులై 4న పోలీసులు నందనపై చీటింగ్ కేసు  నమోదు చేశారు. నందనపై ఇలాంటి ఆరోపణలు రావడం ఇది మొదటిసారి కాదు. యూకేలో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు గతంలో ఎన్టీఆర్ జిల్లాలోనూ ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి జారీ అయిన లుక్‌అవుట్ నోటీసుల కారణంగా ఇటీవల హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెను అధికారులు అదుపులోకి తీసుకున్నారు.  అయితే, ఈ మోసాలతో తనకు సంబంధం లేదని, తన భర్తే ఇలాంటి వ్యవహారాలు చూసుకుంటారని విచారణ సందర్భంగా ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

**హైదరాబాద్, నవతరం:**  కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.



# బ్రిక్స్ దేశాల తీవ్ర ఖండన

**న్యూ ఢిల్లీ, నవతరం:** న్యూఢిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో సభ్య దేశాలు ఉగ్రవాదంపై కీలక తీర్మానం చేశాయి. 2025లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిని ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదం 'ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం' అనే విధానానికే తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. ఈ మేరకు సెప్టెంబర్ 12న ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్'లో తమ నిర్ణయాన్ని స్పష్టం చేశాయి. 2025 ఏప్రిల్ 22న పహల్గాంపై జరిగిన ఉగ్రదాడిని అత్యంత కఠిన పదజాలంతో ఖండిస్తున్నట్లు బ్రిక్స్ నేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, పలువురు గాయపడటం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాద చర్యలు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు, ఏ కారణంతో చేపట్టినా అవి నేరపూరితమైనవేనని, ఏమాత్రం సమర్థనీయం కావని తేల్చిచెప్పారు. సరిహద్దులు దాటి సాగే ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాదానికి నిధులు సరఫరా, వారికి సురక్షిత ఆశ్రయాలు కల్పించడం వంటి అన్ని రూపాల్లోని ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాడతామని బ్రిక్స్ దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. గ్రవాద నిరోధక చర్యల్లో ద్వంద్వ ప్రమాణాలను పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతీయతకూ, నాగరికతకూ లేదా నిర్దిష్ట జాతి సమూహానికీ ముడిపెట్టకూడదని నేతలు పిలుపునిచ్చారు. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడేవారిని, వారికి మద్దతునిచ్చే వారిని జాతీయ, అంతర్జాతీయ చట్టాల ప్రకారం బాధ్యులను చేసి, న్యాయస్థానం ముందు నిలబెట్టాలని కోరారు. ముఖ్యంగా యువతలో పొంచి ఉన్న తీవ్రవాదాన్ని, రాడికలైజేషన్‌ను ఎదుర్కోవడానికి సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని నొక్కిచెప్పారు. అయితే, ఈ దాడి వెనుక ఏ దేశపు మద్దతు ఉందనే విషయాన్ని ఈ డిక్లరేషన్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. గతంలో 2025 బ్రిక్స్ రియో డిక్లరేషన్‌లోనూ, టియాంజిన్‌లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులోనూ పహల్గాం ఘటనపై ఇదే తరహాలో ఖండన తీర్మానాలు వెలువడటం గమనార్హం.



Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com